కథా నిలయం
5656
శ్రీకాకుళం

ఆరాధన కథల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన కథ

# పురుగు

నా మానస వీణాతంత్రులను ప్రేమగా మీటి ప్రణయ రాగాలు పలికించిన పరిమళ కేమైంది ? మెడలో మూడు ముళ్లు, మూడు రాత్రుల మురిపాలు ... మూడు నెలలు గడవగానే ... ప్చ్ ... ఏమో !

ఆడదాని ఓరచూపుతో, జగాన ఓడిపోని ధీరుడెవ్వడోయ్ ! ... అని కవితాధార లొలికించిన కవి పుంగవుని ఊహల వ్యూహాలకు ప్రేయసి పెళ్లాం కాగానే ప్రియుడు ఆమె దృష్టిలో పచ్చిపులుసై పోతాడనే అంశమందక పోవడం విచిత్రమే ... అయినా అదే సంగతి పరిమళని డైరెక్ట్‌గా అడిగేద్దామంటే ... తియ్యబోయి కయ్యలో పడ్డట్టై పోతుందేమో ...

జణ్, జణ్ ... ఝణ్, ఝణ్, ఝుంఝుణ్ ... పరిమళ పట్టా గొలుసుల శబ్ద మాధుర్యం చెవులకు చేరువైంది. వెన్నుపూసను సోఫాకప్పగించి జేరగిలబడి కూచున్న నరేందర్ ఆలోచనా లోచనాలు చేతిలోని పత్రిక రెక్కలు మలిచేసి పక్కకు మళ్లాయి.

"ఇదో నరేన్ ! కాలమైనా, కడలికెరటమైనా మనిషి కోసం ఆగవంటారు గదా! త్వరగా తెమలాలి. టైమైపోతుంది." చాయ గ్లాసు టీపాయ్ మీదుంచి చల్లగా జారుకుంది.

ఎందుకంత నిర్లక్ష్యం ? మొదటి మూడు రాత్రులప్పట్లా జడ నిండా పూలు తురుముకుని చాయ గ్లాసుతో పక్కన కూచుని కమ్మని కబుర్లు చెప్పొచ్చుగదా ! సినిమాల గురించో, టీవీ సీరియల్స్ జిమ్మిక్కుల గురించో హాపీగా చర్చించుకోవచ్చు గదా ! కనీసం ... ఓ అరగంట అలా గడిపితే ... ! లేదే ! ఇంతలో ఎంత మార్పు !... అనుమానం పురుగు నరేందర్ నరాల్లో జీవం పోసుకుంటోంది.

క్లాసు వన్ ప్రైవేట్ కంపెనీలో నరేందర్ మిడిల్ క్లాసు ఆఫీసరు. పరిమళనేమో ప్రభుత్వాఫీసులో పర్మనెంటు ఉద్యోగిని. ఒకే వీధిలో ఉండేవారు. ఎదురెదురు ఇళ్ల నుండి తయారై బయలుదేరి, డ్యూటీలకెళ్తూ బస్‌స్టాప్‌లో ఒకరినొకరు పలుకరించుకునే వారు. కళ్లతో ముచ్చటించుకుంటూంటే బుగ్గల మీద సిగ్గుల మొగ్గలు రెక్కలు విప్పుకునేవి. పక్క పక్కన నుంచుని ఊహాలోకాల్లో ఉయ్యాలలూగుతూ డ్యూయెట్లు పాడుకునేవారు. కంపెనీ లోన్‌తో హీరో హోండాకు యజమాని అయిపోయిన నరేందర్ కొత్త హీరోలా కన్పించాడు. అప్పుడప్పుడు ఆఫీసు ముందు డ్రాప్ చేస్తుంటే పరిమళ మనసులో సిరిమల్లెలు పరిమళించేవి. ఆమె రూపం అతని గుండెగూటిలో తిష్ఠ వేసుకుంది. హీరోహోండా పరుగుల్లో ఆ రూపం డ్రాప్ కాకుండా మాటల స్వీట్లతో మచ్చిక పరుచు కున్నాడు.

సిటీ బస్ స్టాపులో బస్సు కోసం కలిసి పరుగెత్తిన డెబ్బై అడుగుల్లో మొగ్గదొడిగిన ప్రేమ, హీరోహోండా మీద వికసించి పెళ్లిపందిట్లో తలంబ్రాలు పోయించింది. రెండు నిండు గుండెల్ని ఒకటి చేసిన మాంగల్యబలం బ్రహ్మచర్యానికి బాయ్ బాయ్ చెప్పించింది. ఇద్దరి అద్దెగదుల్ని ఖాళీ చేయించి ఫ్యామిలీ పోర్షన్లో పులకింప చేసింది. నూతన దాంపత్యం మూడు ముద్దులు, ఆరు కౌగిలింతలుగా ముందుకు సాగింది.

సుమారు వారం రోజుల క్రితం. సుప్రభాత సమయం. బాల భాస్కరుని పసిడి కిరణాలు బెడ్రూం కిటికీ లోంచి చొచ్చుకొచ్చి చెంపల మీద గంతులేస్తూ మేల్కొలుపులు పాడాయి. ముద్దుల మురిపాలు... సాయంత్రం ఫస్ట్ షో సినిమా ప్రోగ్రాం ఖాయం చేసినై.

సాయంత్రం ఐదింటికి ఠంచన్‌గా ఆఫీసు నుండి బయటికొచ్చాడు నరేందర్. హీరోహోండా మీద సవారయాడు. మార్గమధ్యంలో మూడు మూరల మల్లెదండ ప్యాక్ చేయించుకుని హీరోహోండా జేబులో భద్రపరిచాడు. జోరుగా, హుషారుగా పరిమళ ఆఫీసులో పాదార్పణమైంది.

తీరా లోపలికెళ్లి చూస్తే పరిమళ సీటు ఖాళీగా ఉంది. ఈవిడ నాకంటే ముందే ఇంటికెళ్లలేదు గదా ! చూపులు అటూ ఇటూ పరుగెత్తినై.

సెక్షనాఫీసర్ చాంబర్ గ్లాసు డోర్స్ మీద నిలబడిపోయినై. చాంబర్లో పరిమళ... ఆఫీసర్ ముందు వయ్యారంగా నుంచునుంది. ఇంద్రధనుస్సులా ముందుకు వంగి కుర్రాఫీసర్తో ఏదో మాట్లాడుతుంది. గ్లాస్ డోర్ లోంచి అంతా కనబడుతోంది. పరిమళ మొహం, ఆఫీసర్ మొహానికి దగ్గరగా ఉంది.

లోపలికెళ్లి ఇద్దరినీ నిలదియ్యాలని కాళ్లు ముందుకు లాక్కెళ్తున్నై. కాని సంయమనమే చాలా నయమని ఏదో అజ్ఞాతశక్తి బ్రేకులు వేసింది. హావభావాలు, కదలికలు కనబడుతున్నాయి కాని, మాటలు వినబడ్డం లేదు. నిజంగా కుర్రవాడే సెక్షనాఫీసర్. చాకులాగున్నాడు. ఇద్దరి పెదాల చిరునవ్వుల మీద ట్యూబులైటు వెలుతురు రేఖలు పరావర్తనం చెంది పరచకాలాడుకుంటున్నాయి. ఇద్దరి చూపుడు వేళ్లు ఫైలు కాయితమ్మీద కలసి నడుస్తున్నాయి. ఆఫీసర్ తలెత్తి, పరమళ ముంగురుల చెంగలింపుల్ని చూస్తూ ఏమన్నాడో ఏమో గాని ఆవిడ బుగ్గలు సిగ్గుల ఛాయల్ని రంగరించుకున్నాయి. ఏదో నిర్ణయానికొచ్చి ఇద్దరూ నవ్వుకున్నారు. అత్యంత విలువైన తన ఆస్తులన్నింటి నెవరో ఎగరేసుకు పోతున్నట్టు ... నాగేందర్ నవనాడుల్లో రోషం పొడుచుకొచ్చింది. ఏమీ చెయ్యలేక ... ఏడుపొస్తున్నట్టనిపించింది.

ఎందుకా ఇకఇకలు, పకపకలు ? ఒంటిమీద తేళ్లూ, జెర్రులూ పాకినట్టని

పించింది. మరోసారి ఆవేశం పొంగి కుర్రాఫీసర్ కుత్తుక మీద కత్తితో పొడవాలన్పించింది. ఇహ చూడలేక గిరుక్కున వెనుదిరిగాడు. పరిమళ సీటుముందు కుర్చీలో కూలబడ్డాడు. పావుగంట భారంగా గడిచింది. పరిమళ రాయంచలా అడుగులేస్తూ వచ్చి నాజూగ్గా కూచుంది. ముఖారవిందము చిరునవ్వుల్ని పులుముకునుంది.

"మీరెప్పుడొచ్చారు ?" అలా చూసి ఇలా ఆశ్చర్యం వెలుబుచ్చింది. నల్లని కనురెప్పలు నిండుగా విరబూసిన పూవు మీది గండుతుమ్మెద రెక్కల్లా టపటపలాడినై.

"నువు మీ బాస్‌తో గ్యాస్ కొడుతున్నప్పుడు ..." చిరాకుపరాకులు ... గొంతులో గురగురలు. ఆవిడ కళ్లలోకి సూటిగా చూడాలనుకున్నాడు కాని ఫైళ్ల సర్దడంలో లీనమైంది. ఏదో జోక్‌గా అంటున్నాడనుకుని తనలో తానే నవ్వుకుంది.

"మా సెక్షనాఫీసర్ చలాకీ మనిషి నరేన్ ! పరిచయం చేసుకుంటారా ?" ఫైళ్ల బీరువాకు తాళం వేస్తూ అడిగింది. ఏదో తమకంలో ఉన్నట్టనిపించింది.

"అవునవును. చాటు సరసంలో మేటిగాడు గదా ! వాంతో నాకేం పని?" అనాలనుకున్నాడు కాని, ఆ మాటలు గింజుకోవడంతో పోటీ పడి గొంతులో వచ్చి వెలక్కాయల్లా ఉండిపోయినై. లోపలి ఎసరు బయటికి పొంగకుండా జాగ్రత్త పడుతూ, "ఇప్పుడు పరిచయ కార్యక్రమం పెట్టుకుంటే మన ప్రోగ్రాం మట్టి కొట్టుకుపోతుంది. అయినా ఆఫీసు టైమై అరగంట గడిచింది గదా !" లేచి బయటికి దారి తీశాడు.

పక్కసీట్ల కో-వర్కర్సు తమని విచిత్రంగా చూస్తూ ఏదో గొణుక్కుంటూ, గుస గుసలాడుతూ వెళ్లిపోతున్నారు.

తన పెళ్లాం పరాయి మొగాడితో అంత దగ్గరగా మెదలడం నామోషీగా ఉంది నరేందర్‌కు. వీళ్లంతా తనను పెళ్లాన్ని అదుపులో పెట్టలేని దద్దమ్మ అనుకుంటున్నారేమో! లోలోపల గుంజాటన... సినిమాను ఎంజాయ్ చెయ్యనివ్వలేదు. బాల్కనీ కుషన్ సీటు ముళ్లసింహాసనమైంది. మనిషిగా పరిమళతో భుజం కలిపాడు కాని మనసు గోడల మీద అనుమానాల పురుగులు పాకుతూనే ఉన్నాయి.

ఆ కుర్ర ఆఫీసర్‌కూ, ఈవిడకూ ఎందుకంత ఇది ? వాళ్లిద్దరి మధ్య ఏమున్నది? మూణ్నెళ్లకే మొగుడంటే మోహం మొత్తిందా? ... అలా ఆలోచించడం సబబు కాదేమో! కానీ... వాడు ఎర్రగా బుర్రగా ఉన్నాడు. ఆవిడ దృష్టిలో చలాకీ మనిషి గదా !

నల్లని ఆకాశములో తెల్లని మెరపు రేఖల్లా పరిమళ జడలో నవ్వులు రువ్వాల్సిన మల్లెదండ హీరోహోండా జేబులో జీరో అయిపోయింది. రాత్రంతా కలత నిద్ర. నరేందర్ నవనాడుల్లో కలవరం. ఏవేవో కలలు... కుతకుతలు...

మర్నాడే పరిమళ ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ కం ఆడిట్ ప్రారంభమైంది. అదో హంగామా... దాని లోతుపాతులన్నీ నరేందర్‌కు తెలుసు. ఉదయమే ఆవిడను ఆఫీసు ముందు వదిలేసి వెళ్తున్నాడు. సాయంత్రం పొద్దుపోయాక ఆవిడే తిరిగివస్తుంది. ఆవిడ కాఫీసులో ఊపిరి సలుపుకోలేని పని, ఇంట్లో తడి లేని పొడిపొడి మాటలతో గడిచిపోతుంది.

నిన్ననే ఇన్‌స్పెక్షన్ కం ఆడిట్ పూర్తయింది. పరిమళ ఊపిరి పీల్చుకుంది.

వంట పూర్తి చేసి బయటికొచ్చింది. నరేందర్ వాలకం అదోలాగుంది.

"ఎందుకట్లా ఉన్నారు ?" అడిగింది యథాలాపంగా. పేపర్ చేతులుంచుకుని శూన్యంలోకి చూస్తున్నవాడల్లా చూపులు తిప్పి ఆవిడ నాపాదమస్తకం పరిశీలిస్తున్నాడు.

"ఏం... ఎలాగున్నాను ?" ముక్తసరి.

"ఏదో పోగొట్టుకున్నట్టున్నారు. వారం రోజులు ఇన్‌స్పెక్షన్ గదా. అయ్యగారిని పట్టించుకోలేదని అలక మంచమెక్కారా ?" ఓరచూపులు విసురుతూ వచ్చి పక్కన కూచుంది. కళ్లలోకి చూడాలని ప్రయత్నిస్తోంది.

ఆహాహా ! ఏం వగలూ ! బావి లోతు తెలుసుకోవచ్చుగాని భార్యమనసు లోతు తెలుసుకోవడం కష్టమే. లోపల వికారం, పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం. మనోవికారం బయటపడితే పరిమళ ఏమనుకుంటుందో ! ఎట్లా స్పందిస్తుందో ! ఏం గొడవ జరుగుతుందో !

"ఆc... ఏం లేదు పరిమళా ! ఏదో ..."

"మరైతే లేవండి. కలిసి భోంచేద్దాం."

"నేనింకా స్నానమే చెయ్యలేదు" ఒళ్లు విరుస్తూ లేచినుంచున్నాడు.

"ఏం ? ఎందుకటా ?" కనుబొమలు కొండపల్లి బొమ్మల్లా కదలాడినై.

సంభాషణ పెంచాలన్పించలేదు. చటుక్కున పరుగెత్తి బాత్రూం నాశ్రయించాడు. సూటిగా అడిగితే "అప్పుడే నా మీద అనుమానం ప్రారంభమైందా?" అని హంగామా చేస్తుందేమో !

తనివితీరా వాటేసుకోవాలంటే మనసొప్పడం లేదు. ఆవిడ రుసరుసలకు జవాబు దొరకడం లేదు.

మరో వారం – పది రోజులలాగే దొర్లిపోయినై.

సంసారంలో సరిగమలు, ఆఫీసు పరుగుల్లో పదనిసలు... గుంభనంగా మనుషులు.

***

గుమాస్తాల గుసగుసలు కంప్యూటర్, ప్రింటర్ల శబ్దాలతో మమేకమై పోతున్నై. ఎవరి పనుల్లో వారు... ఆఫీసు బిజీగా ఉంది.

నరేందర్ మెదడు పొరల్లో అల్లిబిల్లి తరంగాలు గిరికీలు కొడుతున్నై. కుర్చీకి జేరగిలబడి కూచున్నాడు. ఒకచోట కేంద్రీకృతం కాలేని చూపులు శూన్యంలో మనశ్శాంతి కోసం వెతుకుతున్నై.

"సార్ ! బెంగుళూరు బ్రాంచి..." ఇంకేదో చెప్పబోతున్న జానకిని, నరేందర్ వాలకం అవాక్కు చేసింది. గుండెలకు హత్తుకున్న ఫైలును టేబుల్ మీదుంచి ముందు కుర్చీలో కూచుంది. పక్క సీట్ల కంప్యూటర్లు పని మీదున్నై.

నరేందర్ సెక్షన్‌లో జానకి డీలింగు అసిస్టెంటు. ముద్దమందారం మొహం, ఎత్తైన గుండెలు, చక్కని ముక్కు మీద చమక్కు మంటున్న ఒంటి రాయి ముక్కుపుడక, మబ్బుల నడుమ ఉదయభానుడిలా నల్లని కనుబొమ్మల మధ్య ఎర్రని కుంకుమ బొట్టు... అందంగా, ఉదాత్తంగా కన్పిస్తోంది. ఆమె భర్త అదే ఆఫీసు... పక్క సెక్షన్లో సూపర్‌వైజర్.

నరేందర్‌నో నిమిషం ఎగాదిగా చూసింది. ఆశ్చర్యంగా భుజాలెగిరి పడినై.

"సార్... సార్ !" ముందుకు వంగి మళ్ళీ పిలిచింది.

అయినా అతన్లో స్పందన లేదు.

దొండపండు లాంటి కింది పెదవి మునిపళ్ల మధ్య కొచ్చింది. అడుగులో అడుగేస్తూ పక్కకొచ్చి నుంచుంది.

"ఇదో సార్ ! ఈ ఫైలు చూస్తారా !" భుజమ్మీద చెయ్యేసి మృదువుగా కుదిపింది.

ఒంటిమీద నిప్పురవ్వ పడ్డట్టు నరేందర్ ఉలిక్కిపడ్డాడు. "ఆఁ... ఆఁ... ! ఏవిటీ ?" సర్దుక్కూచున్నాడు. గంభీర వదనం గబుక్కున విచ్చుకుంది.

ఫైలును అతని ముందుకు జరిపి కాయితాలు తిరగేస్తూ, విశేషాలు వివరిస్తోంది. ఫైలు మీద ఇద్దరి చూపుడువేళ్లు ఒరుసుకుంటున్నై. భుజాలు స్పర్శించుకుంటున్నై. జారిపోతున్న సిల్కు పైటను సర్దుకుంటూంటే స్త్రీ సహజమైన సిగ్గుల ఛాయలు బుగ్గల మీద తచ్చాడుతున్నై. సీరియస్‌గా ఫైలు చూస్తున్నారు.

అబ్బో ! ఈ దృశ్యాన్ని ఎవరన్నా చూస్తే ఇంకేమన్నా ఉందా ? నరేందర్ నరాల్లో భయ ప్రకంపనలు. అంతా విని, నోట్ చదివి, "ఓ యస్ ! యూ ఆర్ కరెక్ట్" అంటూ సంతకించి తల పైకెత్తాడు.

జానకి కూడా తల తిప్పి నిటారుగా నుంచుంది. తిప్పుడు వేగానికి గుండెల మీద వేళ్లాడుతున్న జడ ఎగిరి నరేందర్ చెంపల్ని తాకుతూ వెనక్కు వాలింది.

ఎదురుగా జానకి భర్త శేఖర్.. ముందు కుర్చీలో కూచుని ఉన్నాడు. ఆసక్తిగా చూస్తున్నాడు.

అరె ! ఇతడంతా చూసినట్టుంది. మా గురించి ఏమనుకుంటాడో, ఎలా రియాక్టవుతాడో ఏమో ! నరేందర్ గుండె లబ్ డబ్ మంటోంది.

శేఖర్ చిన్నగా నవ్వాడు. "లంచవరైంది. పదండిహ" గుర్తు చేశాడు.

జానకి కళ్లు కమ్మగా కదిలినై.

"అవునవును. మీరు కూడా పదండి సార్ !" ముంగురులు సర్దుకుంటూ నరేందర్ నాహ్వానించింది.

క్యాంటీన్ డైనింగ్ హాలు నిండుగా ఉంది. ఓ మూల టేబుల్... వాళ్లిద్దరి ముందు కూచున్నాడు నరేందర్. పైన ఫ్యాన్ తిరుగుతోంది. అది తన బుర్రలో తిరుగు తున్నట్టనిపిస్తోంది. కారియర్లు విప్పుకున్నె.

పూరి మీద కుర్మా వేసి "ఇది కూడా రుచి చూడండి సార్ !" నరేందర్ కందించింది జానకి.

మరోసారి గుండె గుబగుబ లాడింది. దొంగతనం చేస్తూ రెడ్ హాండెడ్గా పట్టు పడుతున్న ఫీలింగ్.

శేఖర్ ఏమనుకుంటున్నాడో ! అతడెంత ఇదవుతున్నాడో ! "సారీ శేఖర్ గారూ !" అనేశాడు ఎందుకైనా మంచిదని. "మీరేమనుకుంటున్నారో ఏమో !" మొహాన్ని వికారం అలుముకుంటోంది.

శేఖర్ పెదాల మీద చిరునవ్వు మెరిసింది. "ఎందుకటా ?" అడిగాడు పూరీ ముక్కకు కుర్మా నంజుకుంటూ.

జానకి – శేఖర్లది ఒకే కారియర్.

"అదే... జానకి గారు... ఇలా..." నీల్లు నమిలాడు.

"అయ్యో, నేనేమన్నాను సార్?" జానకి అయోమయం.

"అదే.. అదే.. " కుర్చీని వెనక్కు జరుపుక్కూచుని తాబేలులా ముడుచుకు పోతున్నాడు.

జానకి–శేఖర్ నవ్వుకున్నారు. మొహాలు చూసుకున్నారు. "ఇతడో సత్తెకాలపు సత్తెయ్యలాగున్నాడే !"

"అణుపరమాణుయుగంలో ఇంతటి అమాయకత్వమా !"

సైగలతో మాట్లాడుకున్నారు.

"అందులో అనుకునేదేముంది నరేందర్ భయ్యా ?" శేఖర్ కేమీ అర్థం కాలేదు.

"అదే..." అంటీ అంటనట్టు పూరీ ముక్కను పెదాలకందించుకొంటున్నాడు.

"జానకిగారు ఆఫీసులో అలా, ఇప్పుడిలా ... నాకు దగ్గరగా..." మాటల్లో తడబాటు.

"అయ్యో రామా ! మీరెంత భోళా మనిషి సార్ !" జానకి గలగలా నవ్వింది. ఆ నవ్వులో జలపాతం లయ ఉంది.

భార్యాభర్తలు మరోసారి మొహాలు చూసుకుని నవ్వుకున్నారు.

"నరేందర్ భయ్యా !" చివరి పూరీ చివరి ముక్కను పూర్తి చేస్తున్న శేఖర్ గొంతులో గాంభీర్యం. "ఇది కంప్యూటర్ యుగం. మనలాంటి మధ్యతరగతి కుటుంబాల్లో ఆడా – మగ అందరూ పంజేస్తేనే ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే రోజులివి. ఆడా–మగ కలిసి పంజేస్తున్న ఆఫీసుల్లో సంస్థల్లో ఇవన్నీ మామూలే గదా !" సూటిగా కళ్లలోకి చూస్తూ, "కలిసి పంజేస్తున్న కొలీగ్స్ మాట్లాడుకుంటూ ఫ్రీగా మూవ్ కాకపోతే రొటీన్ పనులెట్లా అవుతాయి ? ఆ మాత్రానికే ఆడవాళ్ల ననుమానంగా చూసే మగాళ్లు, మగాడిని అనుమానించే ఆడవాళ్లు ఉన్నారంటే వాళ్ల కుసంస్కారాన్ని ప్రశ్నించాల్సి వస్తుంది. ప్రత్యేకించి ఉద్యోగిని భార్యను చీటికి మాటికి అనుమానించే భర్త పతి దేవుడు కాదు, పతి దయ్యమవుతాడు. తాను తృప్తిగా ఉండడు, పెళ్లాన్ని తృప్తిగా ఉండనివ్వడు. అప్పుడు స్వర్గం లాగున్న సంసారం నరకప్రాయమవుతుంది." ముసిముసిగా నవ్వుతూ వాష్ బేసిన్ వైపు అడుగులేశాడు.

జానకి కారియల్ సర్దుతూ "అయినా ... పెళ్లయాకనే మీకీ సందేహం కలగడం విచిత్రంగా ఉంది సార్ !" అంటూ తానూ వాష్‌బేసిన్ వైపు నడిచింది.

నరేందర్ నరాల్లో తియ్యని అలజడి. మబ్బులు తొలగిన సూర్యుడిలా వదనార విందము వింత కాంతుల మయమైంది. మురికి కాల్వ లాగున్న మనసు సర్ఫ్‌తో ఉతికిన తెల్లగుడ్డ లాగైంది.

సాయంత్రం ఇంటికొచ్చేసరికి – చాయగ్లాసుతో ఎదురొస్తున్న పరిమళ – పాల గ్లాసుతో శోభనం గదిలోకొస్తున్న పెళ్లికూతురులా కనబడింది.

*(ఆదివారం – ఆంధ్రప్రభ ... 3-4-2005)*